క్లుప్తంగా

రూ.25 లక్షలతో బీటీ రోడ్డు



పెనుబర్తి గ్రామ ప్రధాన రహదారి

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామానికి సరైన రోడ్డు, వీధికాలువలు లేకపోవడంతో దశాబ్దకాలంగా ప్రజలు ఇబ్బందులు పడే వారు. స్థానిక నాయకులు ద్వారా సమస్యను తెలుసుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు రూ.25 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో నెల రోజుల వ్యవధిలోనే రోడ్డు, కాలువలు నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరాముని సన్నిధిలో జెడ్పీ చైర్మన్



జెడ్పీ చైర్మన్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం అర్తమూరు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు పూజా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వేదపండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. దగ్గరుండి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

అవయవదానంపై చైతన్యం



అవయవదానం చేస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న గరుగుబిల్లి గ్రామస్తులు

మెరకముడిదాం: అవయవ దానంతో మరొకరికి పునర్జన్మ ఇవ్వొచ్చని మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో శనివారం అవయవదానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వందలాది మంది గ్రామస్తులు అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. అవయవదానం చేస్తామని హామీ పత్రాలు ఇవ్వడంతో పాటు ప్రతిజ్ఞ చేశారు.

రుద్రభూమిలో పరమేశ్వరుడి విగ్రహం ఏర్పాటు



పరమేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్, గ్రామ పెద్దలు

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం గ్రామం రుద్రభూమిలో గ్రామానికి చెందిన ఆతవ వెంకటేష్ కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన పరమేశ్వరుడి విగ్రహాన్ని స్థానిక సర్పంచ్ కొట్యాడ నిర్మలసాయి శనివారం ఆవిష్కరించారు. రూ.1,20 లక్షలతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం, దాతల సహకారంతో ఇప్పటికే రుద్రభూమిని అభివృద్ధి చేశామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సుధారాణి, బెల్లాన వంశీకృష్ణ

చీపురుపల్లి: పట్టణంలోని సచివాలయం-5 పరిధిలో పలు అభివృద్ధి పనులకు మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, బెల్లాన వంశీకృష్ణ శనివారం భూమిపూజ చేశారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సచివాలయం-5కు కేటాయించిన రూ.20 లక్షలతో పిల్లపేటలో ఉన్న సామూహిక మరుగుదొడ్ల కాంప్లెక్స్‌కు ప్రహరీ, ప్లాట్‌ఫాంల నిర్మాణం, శ్మశానవాటికలో వాటర్‌ట్యాంక్, ట్యాపుల ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లు పైడిరాజు, మీసాల రామారావు, గంట్యాడ బుజ్జి, సతివాడ అప్పారావు, గంట్యాడ విష్ణు, మహంతి ఉమ పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారుల సంఖ్య పెరగాలి

బొండపల్లి: ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారుల సంఖ్యను పెంచేందుకు క్షేత్రసహాయకులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గంటల నుంచి పనులు చేపట్టినట్లయితే పనులకు వచ్చే వేతనదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, నీడ కోసం టెంట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ



గజపతినగరం రూరల్: ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న రుత్వికులు



గజపతినగరం రూరల్: పూజా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు



జామి: అట్టాడలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయం



జామి: అన్నసమరాధనలో పాల్గొన్న తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు

గజపతినగరం రూరల్: మండలంలోని పిడిశీల గ్రామంలో శ్రీలక్ష్మీగణపతి సీతాసమేత కోదండ రామాలయం ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా వేదపండితులు ఆలయ ప్రాంగణంలో హోమాలు చేశారు. శనివారం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాండ్రంకి మాధవి, ప్రకాశరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్టాడలో..

జామి: మండలంలోని అట్టాడ గ్రామంలో హనుమాన్ సమేత సీతారామాలయ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దక్షిణ భారత హిందూ మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ నందమహారాజన్ భక్తులకు సీతారాముల చరిత్ర, ప్రవచనాలు తెలియజేశారు.

భారీ అన్నసమారాధన

జామి: మండలంలో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శనివారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జి.జి.హేమంత్‌కుమార్, ఆలయ పాలకమండలి సభ్యులు పాండ్రంకి సంజీవి, తోట మధుసూదనరావు, పిన్నింటి ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, ఎంపీటీసీ కంది పద్మావతితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరాలయం ప్రతిష్ట

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ పరిధి సీతంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రారంభోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని, ఆలయంపై పూర్ణ కలశాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమావతి, కోళ్ల లలితకుమారి, ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషికుమారి, ఉప సర్పంచ్ మోపాడ కుమార్, కోళ్ల రాంప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం వేలాదిమంది భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు.



బొండపల్లి: ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

చామలాదేవి అగ్రహారంలో..

వేపాడ: మండలంలో చామలాదేవీ అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఉదయం 7.25 గంటలకు సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలో సీతారామ ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. ఆలయన నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



చామలాదవీ అగ్రహారంలో నూతనంగా నిర్మించిన రామాలయం



శృంగవరపుకోట: సీతంపేట కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న రుత్వికులు, భక్తులు

దైవ చింతనతో గ్రామాల్లో ప్రశాంతత



రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: దైవ చింతనతో గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దాసుళ్లపాలెం గ్రామంలో దేవదాయశాఖ సహకారంతో రూ.50 లక్షల అంచనా వ్యయంతో రామాలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఇప్పటికే పలు ఆలయాలు నిర్మించినట్లు తెలిపారు. గ్రామాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మారినపుడు ప్రజల్లో దైవభక్తి పెరుగుతుందని, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్ ముమ్మన ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మన ప్రసాద్, సతీష్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మండలంలోని పాలవలస గ్రామంలో వార్డు మెంబర్ గుమ్మిడి సూరమ్మతో పాటు మరో 15 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల హర్షం



ఎమ్మెల్యే శ్రీనివాసరావును సత్కరిస్తున్న వైద్యారోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు

శృంగవరపుకోట: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు, పారామెడికల్ ఉద్యోగులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే సమక్షంలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకుడు జె.వి.ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల 24 ఏళ్ల నిరీక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెరదించారని, తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబును రెగ్యులరైజ్ చేయమని అడిగితే మీకు ఇస్తున్న వేతనాలే ఎక్కువంటూ అపహాస్యం చేశారని గుర్తుచేశారు.

సామాజిక భవనానికి శంకుస్థాపన



సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి, తదితరులు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ పరిధి సీతంపేట గ్రామంలో సామాజిక భవన నిర్మాణానికి విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. సామాజిక భవనం నిర్మాణానికి ఎంపీ సత్యనారాయణ ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.25 లక్షలు కేటాయించారు. భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నుంచి అధికమొత్తంలో నిధులు కేటాయిస్తున్న ఎంపీ సత్యనారాయణకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, ఉపసర్పంచ్ మోపాడ కుమార్, వార్డు సభ్యులు చింతల సావిత్రి, వేమలి సావిత్రి, పి.జగదీష్, చింతల నారాయణమూర్తి, ఎలమంచిలి ఈశ్వరరావు, చిప్పాడ రమణ, ఎంపీడీఓ శేషుబాబు, పీఆర్ ఏఈ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

4,230 మంది విద్యార్థులకు జేవీవీ కిట్లు



జగనన్న విద్యాకానుక కిట్లు

గజపతినగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జేవీవీ కిట్లను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. మండలంలోని 42 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 4,230 మంది విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభం రోజున వాటిని అందజేయనున్నట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. కేవీవీ కిట్లలో మూడు జతల యూనిఫాం, రెండు జతలు సాక్షులు, బూట్లు, నోట్‌పుస్తకాలు, బ్యాగ్, బెల్టు, పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్, డిక్షనరీ ఉన్నాయి.

'ఫ్యామిలీ డాక్టర్'పై అవగాహన కల్పించండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



వైద్య సేవలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

గంట్యాడ: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని పెణసాం గ్రామంలో శనివారం నిర్వహించిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహణకు ముందురోజు దండోరాలు వేయించాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గంట్యాడ పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయనతో పాటు డాక్టర్ శీతల్‌వర్మ, డాక్టర్ వెంకటేష్, సత్యారావు, తదితరులు ఉన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామనికి చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఇ.రామలక్ష్మిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఏపీఓ వెంకటప్పలనాయుడు శనివారం తెలిపారు. ఉపాధి పనుల్లో తప్పుడు మస్తర్లు వేసినట్లు గ్రామానికి చెందిన గేదెల అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడం జరిగిందన్నారు. వారి ఆదేశాల మేరకు ఆమెను విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.

చురుగ్గా 'నాడు-నేడు' పనులు



కె.కృష్ణాపురం పాఠశాలలో కొత్తగా నిర్మిస్తున్న తరగతి గదులు

దత్తిరాజేరు: మండలంలోని కోరపు కృష్ణాపురం పాఠశాలలో 'నాడు-నేడు' కింద చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్దాలనే సత్సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'నాడు-నేడు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా పాఠశాలకు రూ.80 లక్షలు నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ నిధులతో పాఠశాలలో అదనపు తరగతి గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు, వంటగది, డైనింగ్ హాల్ నిర్మాణంతో పాటు పాఠశాల సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు.

శిక్షణ తరగతులతో ఎంతో ప్రయోజనం

- ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్

డెంకాడ: శిక్షణ తరగతులు సాంకేతిక విద్యాబోధనకు ఎంతో ప్రయోజనంగా ఉంటాయని ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్టీ-సెర్బ్ సహకారంతో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో డిజైన్ అండ్ సిములేషన్ ఆఫ్ మినియేచర్ యాంటెనా యూజింగ్ మెషిన్ లెర్నింగ్ ఫర్ ఐఓటీ అప్లికేషన్స్ అనే అంశంపై ఆరు రోజుల పాటు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఈ రాడార్ అంటెన్నాస్ అండ్ కంపోనెంట్స్ డివిజన్ సైంటిస్ట్ కె.సాంబశివరావు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డీన్ సునీల్‌ప్రకాష్, కార్యక్రమం కో ఆర్డినేటర్ ఎం .సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్ ఆర్. రమేష్, హెచ్ఓడీ షేక్‌మస్తాన్ వలీ, ఇతర విభాగాలకు చెందిన అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజలకు చేరువైన పాలన

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- దబ్బిరాజుపేటలో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ కేంద్రం ప్రారంభం



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

వేపాడ: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు పాలన చేరువైందన్నారు. నిరుద్యోగ యువతకు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సుమారు 540 సేవలను ప్రజలకు చేరువచేయడం జరిగిందన్నారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుస్తున్నామన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలోనే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలను అందించడంతో పాటు పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేసేందుకు వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అన్ని విధాలుగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, రాష్ట్ర కొప్పెల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరీ, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, గ్రామ సర్పంచ్ దండు ముత్యాలమ్మ, ఎంపీటీసీ చామంతుల లక్ష్మి, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు మన ప్రభుత్వం'

వేపాడ: గ్రామస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. దబ్బిరాజుపేట గ్రామంలో శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని స్థానికులు చెప్పగా.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్మన్ ఎం.కస్తూరి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, తదితరలు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

టారిఫ్ బోర్డుల ఏర్పాటు తప్పనిసరి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజులకు సంబంధించిన టారిఫ్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను, స్కానింగ్ యంత్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెంగీ, మలేరియా, తదితర కేసులు నమోదైతే డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో చిన్నతల్లి, సన్యాసినాయుడు, సత్యారావు, పవన్ అశిస్, తదితరులు పాల్గొన్నారు.